



ప్రమాద ఘటనకు ఇదే కారణం.. ఆలయంలో విరిగిన రెయిలింగ్



మృతదేహాల వద్ద రోదిస్తున్న కుటుంబ సభ్యులు, బంధువులు



ఘటనా స్థలాన్ని పరిశీలిస్తున్న మంత్రి లోకేశ్, పక్కన కేంద్రమంత్రి రామ్మోహన్‌నాయుడు, కలెక్టర్, ఎస్పీ

వేలమంది.. ఒకటే క్యూలైన్

- అధికారులకు సమాచారం ఇవ్వలే.. వలంటీర్లూ లేరు
- ముందస్తు ఏర్పాట్లు చేయకే ఘోరం
- కాశీబుగ్గ వెంకటేశ్వరాలయంలో తొక్కిసలాట
- 9 మంది మృతి.. మృతుల్లో బాలుడు..
- 17 మందికి గాయాలు.. ఇద్దరి పరిస్థితి విషమం
- హుటాహుటిన స్పందించిన రాష్ట్ర ప్రభుత్వం
- బాధితులకు మంత్రుల బృందం పరామర్శ
- మృతుల కుటుంబాలు, క్షతగాత్రులకు భరోసా
- పరిహారం ప్రకటించిన మంత్రి నారా లోకేశ్



కన్నీటిపర్యంతమవుతున్న ఎమ్మెల్యే శిరీష

ప్రమాదానికి కారణాలివీ..

1. ప్రధాన ఆలయం మొదటి అంతస్తులో ఉండడం
2. అంతమంది భక్తులు వస్తారని ఊహించక పోవడం
3. అధికారులు, పోలీసులకు ముందస్తు సమాచారం ఇవ్వకపోవడం
4. దర్శనానికి వెళ్లేవారందరికీ ఒకటే క్యూలైను ఏర్పాటు చేయడం
5. ఘటనా స్థలంలో సరైన గాలి, వెలుతురు లేకపోవడం



బాధితులను ఓదార్చుతున్న మంత్రి అచ్చెన్న

కార్తీకమాసం రెండో శనివారం. ఏకాదశి పర్వదినం. అందరిలోనూ స్వామిని దర్శనం చేసుకోవాలన్న ఆత్రుత. ఒకటే క్యూలైన్ అయినా గంటల తరబడి నిల్చున్నారు. ఐదారువేలు అనుకుంటే 25వేల మంది వచ్చారు. ఉదయం నుంచి దర్శనం సాఫీగానే సాగింది. మధ్యాహ్నం 12.05 గంటల సమయం.. ఉన్నట్లుండి రెయిలింగ్ ఊడిపోయింది. అంతే.. ఒకరిమీద ఒకరు పడ్డారు. తోసుకున్నారు. భయంతో పరుగులు తీశారు. ఎటుచూసినా అరుపులు, కేకలు. పది నిమిషాల తర్వాత ఆ ప్రాంతం భయానకంగా కనిపించింది. చెల్లాచెదురుగా మహిళల మృతదేహాలు.. క్షతగాత్రుల ఆర్తనాదాలతో దద్దరిల్లింది. ఈ ఘటనలో తొమ్మిది మంది మృతి చెందగా.. 17 మంది గాయపడ్డారు. వీరిలో ఇద్దరి పరిస్థితి విషమంగా ఉంది.

- పలాస ఆంధ్రజ్యోతి బృందం

శ్రీకాకుళం, నవంబరు 1(ఆంధ్రజ్యోతి): పలాస కాశీబుగ్గలోని వెంకటే శ్వరస్వామి ఆలయంలో శనివారం తొక్కిసలాట జరిగి తొమ్మిది మంది మృతిచెందారు. 17 మందికి గాయాలయ్యాయి. ఇద్దరి పరిస్థితి విషమంగా మారింది. ఈ ఘటన రాష్ట్ర వ్యాప్తంగా సంచలనమైంది. ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు, ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఈ ఘటనపై దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. మంత్రులు వెంటనే ఘటనా స్థలానికి చేరుకుని.. పరిహారం ప్రకటించడంతో పాటు.. బాధిత కుటుంబాలకు అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. పలాస-కాశీబుగ్గ జంట పట్టణాల్లో కాశీ బుగ్గ పరిధిలో శ్రీనివాసనగర్‌లో హరి ముకుందపండా అనే వ్యక్తి సొంతంగా శ్రీవెంకటేశ్వరస్వామి ఆలయాన్ని ఏడాదిన్నర క్రితం నిర్మించారు. ఆలయం పూర్తిగా ప్రైవేటు పరిధి కావడంతో.. ఏ ఒక్కరి పర్యవేక్షణ.. పరిశీలన (మిగతా 8వ పేజీలో..)



క్షతగాత్రులను ఆస్పత్రికి తరలిస్తున్న దృశ్యం

శోకసంద్రం



గ్రామస్థులతో కలిసి వెళ్లి..

టెక్కలి, నవంబరు 1(ఆంధ్రజ్యోతి): కాశీబుగ్గ వెంకటేశ్వరాలయంలో తొక్కిసలాట ఘటనతో టెక్కలి మండలం బూరగాం పంచాయతీ రామేశ్వరం ఉలిక్కిపడింది. ఈ గ్రామం నుంచి రెండు ఆటోల్లో సుమారు 34 మంది శనివారం ఉదయం 9.30 గంటల సమయంలో ఆలయానికి చేరుకున్నారు. దైవదర్శనం కోసం క్యూలో ఉండగా ఒకేసారి అరుపులు, కేకలతోపాటు ఆర్తనాదాలు వినిపించాయి. తొక్కిసలాటలో గ్రామానికి చెందిన **ఏదూరి చిన్నమ్మి(50)** మృతి చెందింది. పిన్నింటి నాగమ్మ, సూరమ్మ, గౌరీ గాయాలతో బయటపడ్డారు. తమతో కలిసి దైవదర్శనానికి వచ్చి విగతజీవిగా మారిన చిన్నమ్మిని చూసి తోటి గ్రామస్థులు కన్నీటిపర్యంత మయ్యారు. విషయం తెలిసి కుటుంబ సభ్యులు, బంధువులు హుటాహుటిన పలాస-కాశీబుగ్గకు పరుగులు తీశారు.

- చిన్నమ్మికి పెళ్లయింది. కానీ భర్తతో విభేదాల కారణంగా తల్లిదండ్రులు అమ్మనమ్మ, వెంకటస్వామి దగ్గరే చాలాకాలం నుంచి ఉంటోంది. కూలి చేస్తూ జీవనం సాగిస్తోంది. కుమార్తె మృతితో తల్లిదండ్రులు భోరున విలపిస్తున్నారు.

కళ్లెదుటే కన్నుమూసింది



'దేవుడు దర్శనం కోసం వెళ్లిన మా కుటుంబంపై దేవుడే పగబట్టాడు కాబోలు. కళ్లెదుటే నా భార్య విజయ(48) మృతి చెందిన సంఘటన గుండెలు పిండేస్తున్నాయి. ఇంకా నాకు ఎవరు దిక్కు' అంటూ రాపాక చిన్నారావు రోదిస్తున్న తీరు పలువుర్ని కంటతడి పెట్టించింది. కాశీబుగ్గలోని తొక్కిసలాట ఘటనలో టెక్కలి మండలం గూడేం పంచాయతీ పిట్టలసరియాకు చెందిన **రాపాక విజయ** మృతి చెందడంతో కుటుంబ సభ్యులు, బంధువులు సంఘటన స్థలానికి చేరుకుని విలపించారు.

భక్తిభావం ఎక్కువ..



సోంపేట: తొక్కిసలాట దుర్ఘటనలో సోంపేట మండలం బెంకిలి గ్రామానికి చెందిన విద్యార్థి **లొట్ట నిఖిల్(13)** మృతి చెందాడు. నిఖిల్ జింకిభద్రలోని ప్రభుత్వ పాఠశాలలో ఏడో తరగతి చదువుతున్నాడు. తండ్రి పాపారావు సోంపేటలో కలాసీగా పని చేస్తున్నారు. తల్లి పుణ్యవతి(అను), సోదరి భవానీ, గ్రామస్థులతో కలిసి నిఖిల్ శనివారం ఉదయం కాశీబుగ్గలో వెంకటేశ్వరాలయానికి వెళ్లాడు. తొక్కిసలాట ఘటన సమయంలో నిఖిల్ ఒకవైపు, తల్లీ సోదరి మరోవైపు చెల్లాచెదురయ్యారు. నిఖిల్‌పై నుంచి కొంతమంది తొక్కుకుంటూ వెళ్లిపోవడంతో ప్రాణాలు కోల్పోయాడని కుటుంబ సభ్యులు రోదించారు. నిఖిల్‌కు చిన్నప్పటి నుంచి భక్తిభావం ఎక్కువని కుటుంబ సభ్యులు, తోటి విద్యార్థులు తెలిపారు. కార్తీకమాసంలో రోజూ వేకువజామున నగర సంకీర్తనకు వచ్చేవాడన్నారు. శనివారం కూడా నగర సంకీర్తనలో పాల్గొని.. అనంతరం దైవదర్శనానికి వెళ్లి మృతి చెందడం బాధాకరమని విచారం వ్యక్తం చేస్తున్నారు. మృతుడి కుటుంబాన్ని ఇచ్ఛాపురం ఎమ్మెల్యే బెందాళం అశోక్ శనివారం రాత్రి పరామర్శించారు. కుటుంబానికి అండగా ఉంటామని భరోసా ఇచ్చారు.



భర్త దగ్గరకే..



నందిగాం: నందిగాం మండలం శివరాంపురానికి చెందిన **చిన్ని యశోదమ్మ(56)** గ్రామానికి చెందిన సుమారు పది మందితో కలిసి దైవదర్శనానికి వెళ్లి మృతి చెందడంతో గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి. యశోదమ్మ భర్త కొన్నాళ్ల కిందట చనిపోవడంతో కన్నవారింటి వద్దే ఉంటోంది. ఈమెకు పిల్లలు లేరు.

కొడుకు, కోడలితో వచ్చి..



వజ్రపుకొత్తూరు : వజ్రపుకొత్తూరు మండలం దుక్కవానిపేటకు చెందిన **మురిపింటి నీలమ్మ(60)**.. శనివారం కొడుకు, కోడలు వైకుంఠరావు, రాణితో కలిసి శ్రీవెంకటేశ్వరస్వామి ఆలయ దర్శనానికి వచ్చింది. స్వామివారిని దర్శించుకొని తిరిగి ఇంటికి వెళ్లిపోతున్న సమయంలో తొక్కిసలాట జరగ్గా.. ఆ ముగ్గురూ కింద పడిపోయారు. తొక్కిసలాటలో నీలమ్మ ప్రాణాలు కోల్పోవడంతో కొడుకు, కోడలు గుండెలవిసేలా రోదించారు.

నిత్యం దైవదర్శనం...



హరిపురం : మందస మండలం బెల్లుపటియాకు చెందిన **దువ్వు రాజేశ్వరి (60)** నిత్యం దైవదర్శనం చేస్తూ భగవంతుడి సేవలో ఉండేది. ఈమె భర్త రెండేళ్ల కిందట చనిపోగా ఒక కుమారుడు, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. వీరందరికీ వివాహాలు చేసి సాఫీగా సాగుతున్న ఆమె జీవితం అర్ధాంతరంగా ముగిసింది.

సామాన్య కుటుంబంలో..



పలాస: పలాస-కాశీబుగ్గ మున్సిపాలిటీ సూదికొండ కాలనీకి చెందిన **డొక్కర అమ్ముడమ్మ(40)** వెంకటేశ్వర ఆలయ తొక్కిసలాటలో మృతి చెందడంతో విషాదఛాయలు అలముకున్నాయి. ఆమె భర్త డొక్కరి రాజారావు, ముగ్గురు కుమారులు ఉన్నారు. రాజారావు కూలి చేసుకుంటూ బతుకు సాగిస్తున్నారు. అమ్ముడమ్మ మృతి చెందడంతో కుటుంబ సభ్యులు రోదిస్తున్నారు.



మందసకు చెందిన **బోర బృందావతి(62)** గ్రామస్థులతో కలిసి ఆలయానికి వెళ్లి.. మృతి చెందడంతో కుటుంబ సభ్యులు విషాదంలో మునిగిపోయారు. ఈమె భర్త కొన్నాళ్ల కిందట మృతి చెందారు. కుమారుడు, కుమార్తె ఉన్నారు.

అలాగే ఒడిశా రాష్ట్రం గుడ్డిభద్రకు చెందిన **రంగాల రూప** కూడా తొక్కిసలాట ఘటనలో మృతి చెందారు.

త్వరలోనే అర్హులకు కొత్త పింఛన్లు

- మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు

నందిగాం, నవంబరు 1(ఆంధ్రజ్యోతి): ఎన్టీఆర్ భరోసా పథకం కింద అర్హులకు త్వరలోనే కొత్త పింఛన్లు మంజూరు చేస్తామని రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు అన్నారు. శనివారం నందిగాం మండలం వల్లభరాయుడుపాడులో ఎన్టీఆర్ భరోసా పింఛన్లు పంపిణీ చేశారు. మాటామంతీ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ.. 'ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేస్తూ.. అభివృద్ధి, సంక్షేమమే ధ్యేయంగా పాలన సాగిస్తున్నాం. పింఛన్ పెంపుతో ఎంతో మంది పేదలకు లబ్ధి చేకూరుతోంది. పింఛన్‌దారుడైన భర్త మృతి చెందితే.. ఆ తర్వాత నెల నుంచే ఆయన భార్యకు వితంతువు పింఛన్ అందజేస్తున్నాం. వైసీపీ అప్పుల ఊబిలో నెట్టినప్పటికీ సీఎం చంద్రబాబునాయుడు సమర్థవంతమైన పాలనతో ప్రధానమంత్రి మోదీ తోడ్పాటుతో రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో నడిపిస్తున్నారు. దీనిపై (మిగతా 7వ పేజీలో..)



వల్లభరాయుడుపాడులో వృద్ధురాలికి పింఛన్ అందజేస్తున్న మంత్రి అచ్చెన్నాయుడు

నేడు అరసవల్లి ఆదిత్యుని నావికోత్సవం 7

కళ్లెదుటే ఘోరం

- తోపులాటలో ఒకరిపై ఒకరు కిందపడ్డారు
- తొక్కుకుంటూ పరుగులు పెట్టారు
- కాశీబుగ్గ ప్రమాద ఘటనలో ప్రత్యక్షసాక్షులు



ఊహించని ఘటన.. కళ్లెదుటే ఘోరం.. అంతా నిమిషాల్లో జరిగిపోయింది. తోపులాటలో ఒకరిపై ఒకరు పడ్డారు. ప్రాణభయంతో తొక్కుకుంటూ వెళ్లారు. పది నిమిషాల తర్వాత చూసేసరికి భయానక పరిస్థితి. కొందరు మహిళలు నిర్జీవంగా పడిఉన్నారు. ఓ బాలుడు చలనం లేకుండా ఉన్నాడు. క్షతగాత్రుల ఆర్తనాదాలతో ఆ ప్రాంతం నిండి పోయింది. కాశీబుగ్గ వేంకటేశ్వరస్వామి ఆలయంలో ఘోరాన్ని చూసిన వారు ఇప్పటికీ తేరుకోలేక పోతున్నారు.

-పలాస నెట్‌వర్క్



కలెక్టర్, ఎస్పీతో మాట్లాడుతున్న మంత్రి లోకేష్



బాధితులను ఓదార్చుతున్న మంత్రి అచ్చెన్నాయుడు



వేంకటేశ్వర స్వామి ఆలయంలో భక్తుల రద్దీ..



ఆలయం లోపల పరిశీలిస్తున్న మంత్రి లోకేష్, పక్కన మంత్రి అనిత



క్షతగాత్రులను పరామర్శిస్తున్న లోకేష్, రామ్మోహన్‌నాయుడు, శిరీష తదితరులు



పరామర్శిస్తున్న ఎమ్మెల్యే గొండు శంకర్ తదితరులు



ఘటనపై కలెక్టర్‌ను ఆరా తీస్తున్న జిల్లా ఇన్‌చార్జి మంత్రి కొండపల్లి శ్రీనివాస్



తమ వారిని పోగొట్టుకుని విషాద వదనంతో..



బాధితులను పరామర్శిస్తున్న ఎమ్మెల్యే అశోక్



బాధితురాలికి వైద్య సేవలందిస్తున్న దృశ్యం



ఆలయం వద్ద మాజీ మంత్రి సీదిరి అప్పలరాజు

ప్రాణాలతో బయటపడ్డాం..

నరసన్నపేట, నవంబరు 1(ఆంధ్రజ్యోతి): మండలంలోని జమ్ము, తామరాపల్లి, రెడ్డికపేట, బొరిగివలస తదితర గ్రామాలకు చెందిన దాదాపు 200మందికి పైగా భక్తులు శనివారం కాశీబుగ్గ వెంకటేశ్వర స్వామి ఆలయానికి వెళ్లారు. తొక్కిసలాట జరగడానికి పదినిమిషాల ముందే ఆలయం నుంచి బయటకు రావడంతో తామంతా ప్రాణాలతో బయటపడ్డామని వారంతా చెబుతున్నారు. ఈ తోపులాట కొంచెం ముందు జరిగితే తామంతా దొరికిపోయేవాళ్లమని.. ప్రాణాలతో బయట పడి ఇంటికి చేరుకున్నామని జమ్ము గ్రామానికి చెందిన టెంక అప్పలనర్సమ్మ, బోర శాంతమ్మ, రెడ్డి నర్సమ్మ, వెలమల రాధ, రెడ్డి నారాయణ, ఇసా అప్పన్నమ్మ, వాన ప్రభ, టెంక శాంతమ్మ తెలిపారు.



పలాస ఆలయానికి వెళ్లి ఇంటికి సురక్షితంగా చేరుకున్న జమ్ము గ్రామానికి చెందిన మహిళలు



తమ కుటుంబ సభ్యుల కోసం ఆరా తీస్తున్న మహిళ

దర్శనం నుంచి ప్రమాదం వరకు

● **ఉదయం 6 గంటలు:** ఆలయ అర్చకులు, నిర్వాహకులు హరిముకుందపండా.. ప్రథమ దర్శనం చేసుకుని పూజల అనంతరం ఆలయాన్ని తెరిచారు. ● **7 గంటలకు:** భక్తుల రాక ప్రారంభమైంది. ఆ సమయానికి 2వేల మంది వరకూ ఉన్నారు. ● **8 గంటలకు:** భక్తుల రద్దీ అంతకంతకు పెరిగింది. దీంతో నిర్వాహకులు వెంకటేశ్వర స్వామి దర్శనానికి క్యూలో రావాలని మైకులో అనౌన్స్‌మెంట్ చేశారు. ● **9గంటలకు:** ఆలయం అంతా కిటకిటలాడడంతో కేవలం దర్శనం మాత్రమే చేసుకొని పూజా కార్యక్రమాలన్నీ బయట ఉన్న గరుడస్తంభం, అభయాంజనేయ స్వామి విగ్రహం వద్ద చేసుకోవాలని మైకులో ప్రచారం చేశారు. ● **10గంటలకు:** జనం రద్దీ తీవ్రంగా ఉండడంతో వాహనాలన్నీ బారులు తీరుతూ ఆలయానికి రెండు కిలోమీటర్ల వరకూ ఉండిపోవడంతో ట్రాఫిక్ స్తంభించింది. ● **11గంటలకు:** కాశీబుగ్గ పోలీసులకు సమాచారం రావడంతో ఎస్ఐ నర్సింహమూర్తి నలుగురు కానిస్టేబుళ్లతో వచ్చి ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించారు. అప్పటికే ట్రాఫిక్ అక్కుపల్లి రోడ్డు, శ్రీచైతన్య స్కూల్, కాశీబుగ్గ మూడు రోడ్ల జంక్షన్ వరకూ నిండిపోయింది. అర కిలోమీటరు రావడానికి గంట సమయం పట్టింది. ● **మధ్యాహ్నం 12 గంటలకు:** వేలాది మంది భక్తులు దర్శనం చేసుకొని వెళ్లిపోవడానికి ఇన్, ఔట్ గేటు నిండా బా రులు తీరారు. 12.05 నిమిషాలకు తొక్కిసలాట జరిగింది. స్టీల్ బారికేడ్లు విరిగిపోవడంతో అంతా కింద పడిపోయారు. వారి మీద నుంచి భక్తులు పరుగులు తీయడంతో ఊపిరాడక అక్కడికక్కడే 9 మంది మృతి చెందగా, 15మందికి పైగా క్షత గాత్రులయ్యారు. ● **12.10 నిమిషాలకు:** 108 సిబ్బంది హుటాహుటిన వచ్చి క్షతగాత్రులను ఆసుపత్రికి తరలించారు. పలాస ఎమ్మెల్యే గౌతు శిరీష సంఘటనా స్థలానికి చేరుకొని వెంటనే క్షతగాత్రులను ఆసుపత్రికి తరలించాలని తన కారును సైతం అందించారు.

● పోలీసులకు సమాచారం ఇచ్చినా కేవలం ట్రాఫిక్‌ను మాత్రమే నియంత్రణ చేసి ఆలయం లోపలకు అడుగు పెట్టలేదు. ఆలయంలో ఇద్దరు పోలీసులు ఉన్నా ఇంత ఘోరం జరిగి ఉండేది కాదు. కేవలం పోలీసుల వైఫల్యం ఇక్కడ కొట్టొచ్చినట్లు కనిపిస్తుంది. ఆలయానికి కమిటీ అంటూ లేకపోవడంతో కేవలం ఇద్దరు ముగ్గురితోనే ఆలయాన్ని నిర్వహిస్తున్నారు. స్వచ్ఛంద సంస్థలు, ఎన్‌సీసీ, ఎస్ఎస్ఎస్, ఆర్ఎస్ఎస్, షిర్డీసాయి, సత్యసాయి బృందాలు స్వచ్ఛందంగా సేవలు చేయడానికి సిద్ధంగా ఉన్నా వారి సహాయం కోరలేకపోయారు. ఈ కారణంగానే భారీ ప్రమాదం జరిగిందని భక్తులు అంటున్నారు.



గాయపడిన మహిళతో మాట్లాడుతున్న శిరీష



వివరాలు సేకరిస్తున్న అధికారులు

గాయపడిన కంచిలి మండల వాసులు..

కంచిలి, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): కాశీబుగ్గ లోని తొక్కిసలాట ఘటనలో కంచిలి మండలం జలంత్రకోట పంచాయతీ మధుపురం గ్రామానికి చెందిన కొరికాన సంగీత, కొరికాన చంద్రమ్మ, బడ్డి యశోదమ్మ స్వల్పంగా గాయపడ్డారు. అధికా రులు పలాస ప్రభుత్వ ఆసుపత్రిలో వారికి చికిత్స అందించి, స్వస్థలాలకు పంపించారు. ప్రస్తుతం తాము క్షేమంగానే ఉన్నామన్నారు.

ఘటనా స్థలం వద్ద ఆర్తనాదాలు..

ఘటన స్థలం వద్ద భక్తుల ఆర్తానాథాలు వినిపించాయి. ఒకేసారి ఇన్‌గేట్, అవుట్‌గేట్ నుంచి భక్తుల తాకిడితో పెరగడంతో గందరగోళ పరిస్థితి ఏర్పడింది. భక్తులు కాపాడాలంటూ ఆర్తనాథాలు చేయగా, కొందరు రైలింగ్‌ను నెట్టుకుంటూ మెట్ల నుంచి కిందకు పడిపోయారు. ఇంకొంతమందిని తోటి భక్తులు పట్టుకోవడంతో బతికిబయటపడ్డారు. భక్తులు గుంపుగా పడడంతోనే తొక్కిసలాట జరగడానికి ప్రధాన కారణమైంది. ఈ సమయంలో వలంటీర్లు, పోలీసులు లేకపోవడంతో మృతుల సంఖ్య పెరిగింది.

కళ్లముందే రాలిపోయారు..



తన కళ్ల ముందే ఒకరికొకరు కిందపడి నలిగిపోయారు. వారంతా క్షేమంగా ఉన్నారని అనుకున్నాను. ఇంతలోనే ఘోరం జరిగిపోయింది. అప్పటికీ తాను కేకలు వేస్తున్నా ఒకేసారి అంతా ఆర్తనాదాలు చేయడంతో నా గొంతు వినిపించలేదు. లేకుంటే కనీసం ఒకరినైనా బ్రతికించుకునేదాన్ని.

-వీరమ్మ

పోలీసులు లేరు..



నా కళ్ల ముందే ఈ దుర్ఘటన జరిగింది. కిందపడిన వారిని బయటకు తీసుకొచ్చినా ఫలితం లేకపోయింది. తొక్కిసలాట జరిగిన ప్రాంతంలో పోలీసులు గాని, వాలంటీర్లు గాని లేకపోవడంతో మృతుల సంఖ్య పెరిగింది.

-జనపాన తేజ, టెక్కలి మండలం



పలాసలో ఆస్పత్రి వద్ద గుమిగూడిన క్షతగాత్రుల కుటుంబ సభ్యులు, బంధువులు



ఆలయం నుంచి ఆసుపత్రికి తరలిస్తూ...



మహిళల మృతదేహాల వద్ద రోదిస్తున్న బంధువులు



ఘటనా స్థలంలో డీఐజీ గోపినాథ్ జట్టి, ఎస్పీ మహేశ్వరరెడ్డి



మృతదేహాన్ని తరలిస్తున్న పోలీసులు, స్థానికులు





ఎంతపని చేశావు దేవుడా.. అయిన వారిని పోగొట్టుకుని విషాదంతో..

పది నిమిషాల్లో ఘోరం..

పలాస/రూరల్/కాశీబుగ్గ/వజ్రపుకొత్తూరు/హరిపురం/మెళియాపుట్టి, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): ఈ ఆలయానికి ప్రతి సోమ, శనివారాల్లో రెండు నుంచి 5వేల మంది వరకూ భక్తులు వస్తుంటారు. ఈ శనివారం కార్తీక ఏకాదశి కావడంతో ఉత్తరాంధ్ర జిల్లాల నుంచి బస్సులు, ఆటోలు, కార్లపై 25వేల మందికి పైగా భక్తులు వచ్చినట్లు అధికారులు అంచనా వేస్తున్నారు. ఆలయానికి వచ్చే.. పోయే మార్గం ఒక్కటే ఉంది. ఈ మార్గంలో మధ్యాహ్నం 12.05 గంటలకు ఔట్ గేటు నుంచి, ఇన్‌గేటు నుంచి భక్తులు పెద్ద సంఖ్యలో రాకపోకలు సాగించడంతో చిన్న తొక్కిసలాట ప్రారంభమైంది. స్టీల్ బారికేడ్లలో కొంతమంది భక్తుల కాళ్లు చిక్కుకుపోవడంతో తీవ్రంగా రోదించారు. దీంతో ఏదో జరుగు తుందని భావించి ఒకేసారి అంతా అదే మార్గం నుంచి ఒక్క ఉదు టన బయటకు వచ్చే ప్రయత్నం చేయడంతో రైలింగ్ మొత్తం విరిగిపడి ఒకరిమీద ఒకరు పడిపోయారు. వారి ని తొక్కుకుంటూ చాలామంది బయటకొచ్చే ప్రయత్నం చేయడంతో అక్కడికక్కడే 9 మంది మృత్యువాత పడ్డారు. ఏం జరుగుతుందో తెలుసుకునేలోపే మరో 15 మంది తీవ్ర గాయాలతో పడిపోవడం కనిపించింది. ఇదంతా పది నిమిషాల్లోనే జరిగిపోయిందని ప్రత్యక్ష సాక్షులు చెబుతున్నారు. ఒక్క ఉదుటన వెనుక నుంచి నెట్టినట్లు అయిందని, తాము వెనుదిరిగి చూసుకునేలోపే కిందపడి ఉన్నామని, తమ కళ్ల ఎదుటే చాలామంది చనిపోయారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. క్యూలైన్ వద్ద ఎటువంటి కాపలాదారులు గాని, పోలీసులు గాని భక్తులను కంట్రోల్ చేయడానికి లేకపోవడంతో భారీ ప్రమాదం చోటు చేసుకుందని అంటున్నారు.

స్వస్థలాలకు మృతదేహాల తరలింపు..

తొక్కిసలాటలో మృతిచెందిన భక్తుల మృతదేహాలను వారి స్వస్థలాలకు అంబులెన్స్‌లలో తరలించారు. పోలీసు బందోబస్తుతో పంపారు. మృతదేహాలను బం ధువులను అప్పగించే సమయంలో మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు, ఎమ్మెల్యే శిరీష, కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్, ఎస్పీ మహేశ్వరరెడ్డి ఉన్నారు.

వైభవంగా కార్తీక ఏకాదశి పూజలు

కార్తీక ఏకాదశి సందర్భంగా శనివారం శైవ, వైష్ణవాలయాలకు భక్తులు పోటెత్తారు. వేకువజాము నుంచే ఆలయాల్లో భక్తజనం బారులు తీరారు. కొన్నిచోట్ల సామూహిక సత్యనారాయణ వ్రతాలు ఆచరించారు. తులసి కోటల వద్ద పూజలు చేశారు. జిల్లాలో ప్రసిద్ధిచెందిన శ్రీముఖలింగం, రావివలస, శ్రీకూర్మం తదితర పుణ్యక్షేత్రాలు భక్తులతో కిటకిటలాడాయి.

-ఆంధ్రజ్యోతి బృందం


గార: శ్రీకూర్మనాథుని ఆలయ ధ్వజస్తంభం వద్ద పూజలు చేస్తున్న భక్తులు


జి.సిగడాం: రంగనాథస్వామి ఆలయ ప్రాంగణంలో తులసి కోటను పూజిస్తున్న మహిళలు


జలుమూరు: శ్రీముఖలింగంలో పార్వతీపరమేశ్వరుల గ్రామోత్సవం


సోంపేట: లక్కవరంలో స్వామి దర్శనానికి వేచి ఉన్న భక్తులు


ఇచ్ఛాపురం: సత్యనారాయణ స్వామి వ్రతాల్లో పాల్గొన్న దంపతులు


కంచిలి: వేంకటేశ్వరుని పల్లకీసేవలో పాల్గొన్న భక్తులు


సరుబుజ్జిలి: పూజలు చేస్తున్న భక్తులు


హిరమండలం: రమాసత్యనారాయణ స్వామి ఆలయంలో..


పలాసరూరల్: కాశీబుగ్గ బృందావనచంద్ర ఆలయం వద్ద భక్తుల బారులు


నరసన్నపేటలోని వేంకటేశ్వరస్వామి ఆలయం వద్ద..


ఎచ్చెర్ల: వేంకటేశ్వరుని సన్నిధిలో...


పాతపట్నంలోని కళ్యాణ వేంకటేశ్వరుని ఆలయం వద్ద..

ఘనంగా సూర్యదేవుని కల్యాణం


ఆదిత్యునికి కల్యాణం నిర్వహిస్తున్న దృశ్యం

అరసవల్లి, నవంబరు 1(ఆంధ్రజ్యోతి): ప్రత్యక్ష దైవం, ఆరోగ్య ప్రదాత అయిన అరసవల్లి సూర్య నారాయణ స్వామి వారికి శనివారం వైభవంగా కల్యాణం నిర్వహిం చారు. కార్తీక శుద్ధ ఏకాదశిని పురస్కరించుకుని ఆలయ అనివెట్టి మండపంలో ప్రధాన అర్చకులు ఇప్పిలి శంకరశర్మ ఆధ్వర్యంలో అర్చకులు, వేద పండితులు మంగళ వాయిద్యాలు, వేదమంత్రాల నడుమ స్వామివారి కల్యాణం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అర్చకులు ఇప్పిలి సాందీపశర్మ, దర్భముళ్ల శ్రీనివాసశర్మ, ఆర్.వికాస్‌శర్మ తదితరులు పాల్గొన్నారు.

నిరుపయోగ ఖాతాలను పునరుద్ధరించుకోండి: జేసీ

శ్రీకాకుళం కలెక్టరేట్, నవంబరు 1(ఆంధ్రజ్యోతి): బ్యాంకు ఖాతాలను ఎవరైనా పదేళ్ల పాటు వాడకపోతే ఆ మొత్తం రిజర్వు బ్యాంకు ఆఫ్ ఇండియా ఖాతాకు బదిలీ అయిపోతుందని, అటువంటి నిరుపయోగ ఖాతాలను ఆ వ్యక్తి లేదా కుటుంబ సభ్యులు పునరుద్ధరించుకోవాలని జేసీ ఫర్మాన్ అహ్మద్ ఖాన్ సూచించారు. బ్యాంకర్లు, బీమా కంపెనీలతో శనివారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో నిర్వహించిన సదస్సులో ఆయన మాట్లాడారు. జిల్లాలో ఇటువంటి ఖాతాల్లో రూ.9కోట్లకు పైగా నగదు ఉందని తెలిపారు. సామాన్య ప్రజానీకానికి సంబంధించిన రూ.80 కోట్ల వరకు నగదు ఉందని, అవి ఖాతాదారులకు చేరేలా బ్యాంకర్లు అవగాహన కల్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో డీసీసీబీ ఛైర్మన్ శివాల సూర్యనారాయణ, లీడ్ బ్యాంకు మేనేజర్ పేడాడ శ్రీనివాసరావు, డ్వామా పీడీ సుధాకర్, మెప్మా పీడీ వెంకటరావు, బీసీ/ఎస్సీ కార్పొరేషన్ ఈడీ గడ్డెమ్మ, సివిల్ సప్లయిస్ డీఎం వేణుగోపాల్ పాల్గొన్నారు.

బీఆర్‌ఏయూలో ఎర్రన్నాయుడి వర్ధంతి


ఎర్రన్నాయుడి చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న వీసీ, రిజిస్ట్రార్ తదితరులు

ఎచ్చెర్ల, నవంబరు 1(ఆంధ్రజ్యోతి): డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ యూనివర్సిటీలో కేంద్ర మాజీ మంత్రి కింజరాపు ఎర్రన్నాయుడి వర్ధంతిని శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎర్రన్నాయుడి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలోఏ వీసీ ప్రొఫెసర్ కేఆర్ రజని, రిజిస్ట్రార్ ప్రొఫెసర్ బి.అడ్డయ్య, వర్సిటీ ప్రిన్సిపాల్స్ డాక్టర్ ఎం.అనూరాధ, డాక్టర్ సీహెచ్.రాజశేఖరరావు, పూర్వపు రిజిస్ట్రార్ ప్రొఫెసర్ పి.సుజాత, ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ డాక్టర్ డి.వనజ తదితరులు పాల్గొన్నారు.

స్మార్ట్ కిచెన్‌లను రద్దు చేయాలి

శ్రీకాకుళం, నవంబరు 1(ఆంధ్రజ్యోతి): విద్యార్థులకు, మధ్యాహ్న భోజన కార్మికులకు నష్టదాయకమైన స్మార్ట్ కిచెన్ సెంటర్లను తక్షణమే నిలుపుదల చేయాలని ఏపీ మధ్యాహ్న భోజన కార్మిక యూనియన్ జిల్లా కమిటీ ప్రభుత్వాన్ని డిమాండ్ చేసింది. ఈ మేరకు వారు డీఈవో కార్యాలయ ఏడీ ఎం.శ్రీనివాసరావుకి శనివారం వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా యూనియన్ గౌరవాధ్యక్షురాలు అల్లు మహాలక్ష్మి, సీఐటీయు జిల్లా ఉపాధ్యక్షురాలు కె.నాగమణి మాట్లాడుతూ 20 ఏళ్లుగా పనిచేస్తున్న కార్మికులకు అన్యాయం చేయవద్దని కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు కె.సుశీల, బి.ఉత్తర, నాయకులు ప్రవీణ పాల్గొన్నారు.

దరఖాస్తుల గడువు పెంపు

గుజరాతీపేట. నవంబరు 1 (ఆంధ్రజ్యోతి) వమరవల్లి విద్యా శిక్షణ సంస్థ (డైట్)లో ఖాళీగా ఉన్న బోధనా సిబ్బంది పోస్టులకు దరఖాస్తుల స్వీకరణ గడువు పొడిగించినట్టు జిల్లా విద్యాశాఖాధికారి ఎ.రవిబాబు తెలిపారు. ఈ నెల మూడో తేదీ వరకు దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు.

కూల్చిన అంగన్‌వాడీ భవనం పరిశీలన

పొందూరు, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): కొంచాడలో కూల్చివేసిన అంగన్‌వాడీ భవనాన్ని ఐసీడీఎస్ సీడీపీవో అనూరాధ శనివారం పరిశీలించారు. భవనాన్ని కూల్చివేసింది ఎవరనేదానిపై ఆరా తీశారు. ఈ మేరకు తహసీల్దార్ రామానుజులు, ఎంపీడీవో వాసుదేవరావులకు ఫిర్యాదు చేశారు. ఆమెతో పాటు సూపర్‌వైజర్ సుజాత, గ్రామస్థులు ఉన్నారు.

నేడు అరసవల్లి ఆదిత్యుని నావికోత్సవం


తెప్పోత్సవం ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్న ఈవో కేఎన్‌వీడీవీ ప్రసాద్

అరసవల్లి, నవంబరు 1(ఆంధ్రజ్యోతి): పవిత్ర కార్తీక మాసం, క్షీరాబ్ది ద్వాదశి సందర్భంగా ఆదిత్యునికి ఆదివారం హంసనావికోత్సవాన్ని నిర్వహించనున్నారు. స్వామివారిని, ఉషా, ఛాయ, పద్మినీ సమేతంగా విశేషంగా అలంకరించి.. ఇంద్ర పుష్కరిణిలో ఏర్పాటు చేసిన హంసనావపై ఊరేగిస్తారరు. కన్నులపండువగా జరిగే ఈ ఉత్సవాన్ని తిలకించేందుకు సాయంత్రం భక్తులు పెద్ద ఎత్తున ఆలయానికి చేరుకుంటారు. సాయంత్రం 4.15 గంటలకు తెప్పోత్సవం మొదలవుతుంది. ఆ తరువాత స్వామివారి ఉత్సవమూర్తులకు తిరువీధి నిర్వహిస్తారు. అనంతరం ఆలయ అనివెట్టి మండపంలో క్షీరాబ్ది ద్వాదశి వ్రతం నిర్వహిస్తారు. స్వామివారిని బంగారు ఆభరణాలతో అలంకరిస్తారు ముక్కోటి ఏకాదశి, కార్తీక ఏకాదశి, క్షీరాబ్ది ద్వాదశి రోజున మాత్రమే స్వామి వారిని ఇలా బంగారు ఆభరణాలతో అలంకరించడం ఆనవాయితీ. ఈసారి ద్వాదశి ఆదివారం రావడంతో తెప్పోత్సవానికి భక్తులు అధిక సంఖ్యలో వచ్చే అవకాశం ఉంది. ఈనేపథ్యంలో ఆలయ ఈవో కేఎన్‌వీడీవీ ప్రసాద్ ఏర్పాట్లను స్వయంగా పర్యవేక్షిస్తున్నారు. భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలుగకుండా అన్ని చర్యలు తీసుకున్నామని తెలిపారు.

పాన్ షాపులో అగ్నిప్రమాదం

ఇచ్ఛాపురం, నవంబరు 1(ఆంధ్రజ్యోతి): స్థానిక సంతపేట వద్ద ఓ పాన్‌షాపులో విద్యుత్ షార్ట్ సర్క్యూట్ కారణంగా అగ్నిప్రమాదం సంభవించింది. దీంతో సామాన్లతో పాటు షాపు కాలి బూడిదయ్యింది. శుక్రవారం రాత్రి షాపు యజమాని జాజుల దుర్గ షాపు మూసి ఇంటికి వెళ్లిపోయారు. ఆ తరువాత గంట సేపటికే షాపులో మంటలు వ్యాపించాయని స్థానికులు సమాచారం ఇవ్వటంతో యజమాని హుటాహుటిన షాపు దగ్గరకు చేరుకొని మంటలు ఆర్పేందుకు ప్రయత్నించారు. సమాచారం అందుకున్న అగ్నిమాపక సిబ్బంది వచ్చేసరికే నష్టం జరిగిపోయింది. సుమారుగా రూ.2లక్షల వరకు ఆస్తి నష్టం జరిగి ఉంటుందని అగ్నిమాపక సిబ్బంది తెలిపారు. వార్డు ఇంచార్జ్, టీడీపీ సీనియర్ నాయకులు జన్నెల సంతోష్ బాధిత కుటుంబాన్ని పరామర్శించి...ప్రభుత్వం ద్వారా సాయం అందేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు.

సీఎం రిలీఫ్ ఫండ్‌తో పేదలకు భరోసా: ఎంపీ


చిన్నమ్మడుకు చెక్కును అందజేస్తున్న ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు

ఎచ్చెర్ల, నవంబరు 1(ఆంధ్రజ్యోతి): సీఎం రిలీఫ్ ఫండ్‌తో పేదలకు భరోసా కల్పిస్తున్నట్టు విజయనగరం ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు తెలిపారు. తోటపాలెం గ్రామానికి చెందిన దీర్సాసి ఈశ్వరరావు ఇటీవల ప్రమాదవశాత్తూ మృతిచెందాడు. మృతుని భార్య చిన్నమ్మడుకు సీఎం రిలీఫ్ ఫండ్ కింద రూ.5లక్షల చెక్కును ఎచ్చెర్లలో శనివారం ఆయన అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం పేద ప్రజలకు అండగా నిలుస్తోందన్నారు. ఈ కార్యక్రమంలో డీసీఎంఎస్ ఛైర్మన్ చౌదరి అవినాష్, మండల టీడీపీ అధ్యక్షుడు బెండు మల్లేశ్వరరావు, పార్టీ నేతలు గాలి వెంకటరెడ్డి, గూరు జగపతిబాబు, మెండ రాజారావు, మూకళ్ల భాస్కరరావు తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి స్విమ్మింగ్ పోటీలకు ఎంపిక

ఇచ్ఛాపురం, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): స్థానిక సత్యసాయి పాఠశాలకు చెందిన ఆరుగురు విద్యార్థులు ఇటీవల జరిగిన జిల్లా స్థాయి స్విమ్మింగ్ పోటీల్లో సత్తా చాటి రాష్ట్ర స్థాయికి ఎంపికయ్యారు. ఈనెల 3, 4 తేదీలలో పల్నాడు జిల్లా నరసరావుపేటలో జరగనున్న రాష్ట్రస్థాయి పోటీల్లో వీరు పాల్గొంటారు. ఈ విద్యార్థులను యువసూర్య చారిటబుల్ ట్రస్ట్ ఛైర్మన్ ఎం.రాంబాబు, డైరెక్టర్ ఎస్.విక్కి, పీఈటీ సాన్ మదీనా, ఎంపీటీసీ సభ్యుడు కె.గోపి అభినందించారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

సోంపేట, నవంబరు 1(ఆంధ్రజ్యోతి): సోంపేట టౌన్ ఫీడర్, సబ్ స్టేషన్‌లో మరమ్మతుల కారణంగా ఆదివారం ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్టు ఈఈ సి.యజ్ఞేశ్వరరావు ప్రకటనలో తెలిపారు. సోంపేట, జింకిబద్ర, బెంకిలి తదితర ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా ఉండదని తెలిపారు.

తుఫాన్‌లో సేవలకు ప్రశంసలు



సీఎం నుంచి ప్రశంసాపత్రాన్ని అందుకుంటున్న తహసీల్దార్

ఇచ్ఛాపురం, నవంబరు 1(ఆంధ్ర జ్యోతి): మొంథా తుఫాన్ సమయంలో అహర్నిశలు శ్రమించి... ప్రజలకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవటంతో పాటు అధికార యంత్రాంగాన్ని అప్రమత్తం చేసిన ఇచ్ఛాపురం తహసీల్దార్ వెంకటరావుకు ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు శనివారం అమరావతిలో సత్కరించారు. ఆయనను అభినందిస్తూ జ్ఞాపికను అందించారు.

అమరజీవి త్యాగం చిరస్మరణీయం


కంచిలిలో పొట్టిశ్రీరాములు చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న దృశ్యం

శ్రీకాకుళం అర్బన్, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రరాష్ట్ర అవతరణ కోసం ప్రాణాలను పణంగా పెట్టిన పొట్టి శ్రీరాములు త్యాగం చిరస్మరణీయమని మాజీ మంత్రి, వైసీపీ నాయకులు ధర్మాన ప్రసాదరావు అన్నారు. ఆంధ్ర రాష్ట్ర అవతరణ దినోత్సవం సందర్భంగా శనివారం నగరంలోని పాతబస్టాండ్ వద్ద పొట్టి శ్రీరాములు వి గ్రహానికి వైసీపీ నాయకులు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ కార్య క్రమంలో వైసీపీ నాయకులు తమ్మినేని సీతారాం, ధర్మాన కృష్ణదాస్, జెడ్పీ ఛైర్‌పర్సన్ పిరియా విజయ, మాజీ మున్సిపల్ ఛైర్‌పర్సన్ ఎం.వి.పద్మావతి, చల్లా శ్రీను, మూకళ్ల తాతబాబు తదితరులు పాల్గొన్నారు.

కంచిలిలో...

కంచిలి, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): అమరజీవి పొట్టిశ్రీరాములు త్యాగం స్ఫూర్తిదాయకమని ప్రభుత్వ కళాశాల ప్రిన్సిపాల్ జగదీష్ కుమార్ అన్నారు. స్థానిక కళాశాల ఆవరణలో ఎన్ఎస్ఎస్ యూనిట్ ఆధ్వర్యంలో శనివారం పొట్టిశ్రీరాములు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ పీవో నరసింహ కుమార్ దాస్, కేసీహెచ్ పట్నాయక్, గార వేణుగోపాల్, వాసుదేవరావు, మురళీకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ వైర్ల దొంగతనంపై కేసు

లావేరు, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): తాళ్లవలస వద్దగల ఓ ప్రయివేటు వెంచర్ స్థలంలో వేసిన విద్యుత్ వైర్లు ఇటీవల గుర్తు తెలియని వ్యక్తులు దొంగిలించారని స్థలం యజమాని సీపాన అప్పారావు శనివారం లావేరు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈమేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ జి.లక్ష్మణరావు తెలిపారు.

త్వరలోనే అర్హులకు కొత్త పింఛన్లు

(ఐదో పేజీ తరువాయి)

వైసీపీ నేతలు విమర్శలు చేయడం సిగ్గుచేటని తెలిపారు. 'టెక్కలి నియోజకవర్గంలో తాగునీటి సరఫరాకు రూ.700 కోట్లు మంజూరయ్యాయి. త్వరలో టెండర్లు పిలిచి పథకాన్ని పూర్తిచేస్తాం. రహదారుల నిర్మాణాలు కూడా పూర్తిచేసి అభివృద్ధికి బాటలు వేస్తాం. పంటల బీమా పథకాన్ని పాత విధానంలో అమలు చేస్తున్నాం. మొంథా తుఫాన్ కారణంగా నష్టపోయిన రైతులను ఆదుకుంటాం. అధికారులు సిద్ధం చేసిన నివేదికలను కేంద్రం దృష్టికి తీసుకెళ్లి పరిహారం అందజేస్తామ'ని మంత్రి అచ్చెన్న తెలిపారు. కార్యక్రమంలో డీఆర్‌డీఏ పీడీ కిరణ్‌కుమార్, పలాస ఆర్డీవో జి.వెంకటేష్, టీడీపీ నాయకులు పి.అజయ్‌కుమార్, పి.చంద్రశేఖర్, ఎం.బాలకృష్ణ, ఎస్.జానకిరాం, జీరు నానీరెడ్డి, ఎస్.కృష్ణారావు, ఎ.సుదర్శనరావు, ప్రవీణ్‌కుమార్, టి.మన్మథరావు, జె.మోహనరావు, కె.ధర్మారావు, బి.సన్యాసిరావు, ఎస్.క్రిష్ణారావు, కూర్మినాయకులు, కె.ప్రసాదరావు, కె.జయరాం పాల్గొన్నారు.

ఉచిత వైద్య శిబిరం

సరుబుజ్జిలి, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): ఎల్‌పీఎం అగ్రహారంలో శ్రీరామ యూత్, శ్రీకాకుళం జెమ్స్ ఆసుపత్రి ఆధ్వర్యంలో శనివారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. సుమారు 140 మందికి వైద్య పరీక్షలు చేశారు. ఉచితంగా మందులు అందించారు. ఈ కార్యక్రమంలో జెమ్స్ సిబ్బంది గ్రామస్థులు పాల్గొన్నారు.

పబ్లిక్ నోటీసు

నా క్లయింట్ అయిన ఇండియన్ బ్యాంక్ శ్రీకాకుళం మెయిన్ బ్రాంచ్ వారి ఐనష్ట్ర క్షన్సుపై జారీ చేసిన పబ్లిక్ నోటీసు. చిన్న దిమ్మిలి గ్రామం, బామిని మండలం, శ్రీకాకుళం జిల్లా వాస్తవ్యులు **శ్రీ లోతుగెడ్డ రవికుమార్ తండ్రి లేటు సోమేశ్వరరావు** అను ఆసామి ఈ దిగువ షెడ్యూల్డు దాఖలా ఆస్తి **శ్రీమతి లోతుగెడ్డ సుందరమ్మ భర్త లేటు క్రిష్ణమూర్తి** చిన్న దిమిలి గ్రామం, బామిని మండలం, శ్రీకాకుళం జిల్లా ద్వారా తే.09.03.2011దీ దస్తావేజు నెం.189/2011 SRO, హిరమండలం వద్ద గిఫ్ట్ సెటిల్మెంట్ దస్తావేజు ద్వారా పొందియున్నారు. సదరు ఆస్తి సదరు సుందరమ్మగారు చిన్నదిమ్మిలి గ్రామం, బామిని మండలం, శ్రీకాకుళం జిల్లా కాపురస్తురాలు శ్రీ పిన్నింటి వరప్రసాద రావు తండ్రి లేటు సవరనాయుడు మరియు శ్రీ పిన్నింటి సంజీవరావు తండ్రి లేటు సవరనాయుడు అను ఆసామీల ద్వారా తే.08.04.2002 క్రయ దస్తావేజు నెం.432/2002. SRO, హిరమండలం ద్వారా రిజిస్టర్ క్రయచీటీమూలంగా పొందియున్నారు. షెడ్యూల్డ్ దాఖలా ఆస్తి మరియు మరికొన్ని ఇతర ఆస్తులు సదరు లోతుగెడ్డ రవికుమార్ గారు తే.03.11.2022 దస్తావేజు నెం. 3341/2022 అనే మెమో రాండమ్ ఆఫ్ డిపాజిట్ ఆఫ్ టైటిల్ డీడ్సు అనే దస్తావేజు ద్వారా స్టేట్ బ్యాంకు ఆఫ్ ఇండియా, కొత్తూరు బ్రాంచిలో తాకట్టు పెట్టియున్నారు. సదరు లోతు గెడ్డ రవికుమార్ గారు నా క్లయింట్ అయిన ఇండియన్ బ్యాంక్ మెయిన్ బ్రాంచ్ వారి వద్దకు షెడ్యూల్డ్ దాఖలా ఆస్తి మరియు ఇతర ఆస్తులు తాకట్టుపై ఋణం పొందియున్నారు. అందు నిమిత్తం తే.22.10.2024 దీన సదరు తాకట్టు ఆస్తులను ఐరసాల చేసి సదరు పైన దస్తావేజులన్నీ తీసుకొని సదరు కొత్తూరు బ్రాంచినుంచి వయా సీతంపేట పాలకొండ వచ్చుచుండగా మార్గమధ్యములో ఒరిజినల్ క్రయదస్తావేజు తే.08.04.2002దీ డాక్యుమెంట్ నెం.432/2002 జారిపోయినది, అని గుర్తించి త్రోవ అంతటా వెతికినను దొరకలేదు. తదుపరి క్రయ దస్తావేజులలో గల చిరునామా చూసి సదరు దస్తావేజు దొరికినవారు ఎవరు అయిన ఇచ్చివేయుదురు అని ఆశతో వేచియున్నారు. కాని ఫలితం లేకపోవటం వలన తే.01.05.2025దీన SHO, సీతంపేట పోలీస్‌స్టేషన్ వారికి విషయంపై ఫిర్యాదు చేయగా సదరు SHO, సీతంపేటవారు దరఖాస్తు సంఖ్య MLDO. 12500523289 గా రిజిస్టర్ చేసి Not Traced సర్టిఫికేట్ జారీచేసియున్నారు.

కావున యావన్మంది ప్రజలకు తెలియజేయునది ఏమనగా సదరు ఒరిజినల్ క్రయదస్తావేజు 432/2002 ఎవ్వరికి అయినను దొరికినచో నా క్లయింట్ అయిన ఇండియన్ బ్రాంక్ శ్రీకాకుళం మెయిన్ బ్రాంచ్ వారికి గానీ లేదా చిన్నదిమ్మిలి గ్రామ వాస్తవ్యులైన శ్రీ లోతుగెడ్డ రవికుమార్ తండ్రి లేటు సోమేశ్వరరావు అను ఆసామికి అందచేయవలసినదిగా ప్రార్థిస్తున్నాము. [illegible]

టి.బాలమురళీకృష్ణ, అడ్వకేట్, డోర్ నెంబర్ 11-6-59, కొల్లా వారి వీధి, శ్రీకాకుళం. సెల్: 7396830089

ఉపాధి కోసం బయలుదేరి..

● రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి



తారకేష్ (ఫైల్)

పొందూరు, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): రాపాక కూడలి సమీపంలోని గ్యాస్ గోదాం ఎదురుగా శనివారం ఉదయం జరిగిన రోడ్డు ప్రమాదంలో శ్రీకాకుళం రూరల్ మండలం పెద్దపాడుకు చెందిన కలగ తారకేష్ (19)అనే యువకుడు మృతి చెందాడు. మృతుని కుటుంబ సభ్యులు, పోలీసులు తెలిపిన వివరాలివీ... తారకేష్ కృష్ణాపురంలో తాపీ పని చేసేందుకు ద్విచక్ర వాహనంపై వెళుతుండగా వెనుక నుంచి వచ్చిన లారీ ఢీకొనడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. తారకేష్ సుమారు ఐదేళ్లుగా కొంచాడ గ్రామంలో గల తమ పెద్దమ్మ దగ్గర ఉంటూ తాపీ పని చేసుకుంటున్నాడు. ఎప్పటిలాగే తారకేష్ కృష్ణాపురంలో తాపీ పని కోసం బయలుదేరి వెళ్లగా.. లారీ రూపంలో మృత్యువు కబళించింది. లారీ ముందు భాగంలోని చక్రాల కింద ద్విచక్ర వాహనం ఉండిపోగా... వెనుక చక్రాల కింద మృతుడి తల నలిగిపోయింది. ప్రమాదం విషయం తెలియటంతో కొంచాడలో ఉన్న కుటుంబ సభ్యులు సంఘటనా స్థలానికి చేరుకొని రోదించారు. మృతుడి పెద్దమ్మ కుమారుడు ఇద్దుబోయిన రాజు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

విద్యుదాఘాతంతో వృద్ధురాలి మృతి



నాగమ్మ (ఫైల్)

నరసన్నపేట, నవంబరు 1(ఆంధ్రజ్యోతి): ఉర్లాం పంచాయతీ జగ్గునాయుడుపేటకు చెందిన నక్క నాగమ్మ (60)అనే వృద్ధురాలు శనివారం విద్యుదాఘాతంతో మృతి చెందింది. కుటుంబ సభ్యులు, పోలీసుల వివరాల మేరకు.. నాగమ్మ తన పశువుల కోసం పచ్చగడ్డి కోసేందుకు పొలాల్లోకి వెళ్లింది. తిరిగి ఇంటికి వస్తున్న సమయంలో ఓ పొలం గట్టుమీద తెగిపడివున్న తీగపై కాలువేయడంతో షాక్‌కు గురై అక్కడికక్కడే మృతిచెందింది. సమీపంలో ఉన్న రైతులు గమనించి కుటుంబ సభ్యులకు సమాచారం ఇచ్చారు. ఉర్లాం విద్యుత్ సబ్‌స్టేషన్ నుంచి మతలాబుపేట, జగ్గునాయుడుపేట, వీఎన్‌పురం గ్రామాల్లోని బోరుబావులకు వేసే విద్యుత్ వైర్ తెగపడిపోవడంతో ఈ ప్రమాదం సంభవించింది. విద్యుత్ శాఖ అధికారులు నిర్లక్ష్యంతోనే తన తల్లి మృతి చెందినట్లు కుమారులు అప్పలనాయుడు, వెంకటరమణ, రాముడు ఆరోపిస్తున్నారు. అప్పలనాయుడు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ దుర్గాప్రసాద్ తెలిపారు.

శాసనం వద్ద గుర్తు తెలియని వ్యక్తి..

పలాస, నవంబరు1 (ఆంధ్రజ్యోతి): శాసనం వద్ద జాతీయ రహదారిపై శనివారం గుర్తు తెలియని వ్యక్తి (35) రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. ఆయన బహిర్భూమికి వెళ్లి తిరిగి వస్తుండగా ప్రమాదం జరిగినట్లు తెలుస్తోంది. ఎస్ఐ నర్సింహమూర్తి కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

బెల్టు షాపుల నిర్వాహకులపై కేసులు

పాతపట్నం, నవంబరు 1(ఆంధ్రజ్యోతి): సారవకోట మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన 15 మంది బెల్టు షాపుల నిర్వాహకులపై బైండోవర్ కేసులు నమోదు చేసినట్లు పాతపట్నం ప్రొహిబిషన్, ఎక్సైజ్ సీఐ కోట కృష్ణారావు తెలిపారు. శనివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. 15 మందిని సారవకోట తహసీల్దార్ విజయ లక్ష్మి ఎదుట హాజరుపరిచనట్లు చెప్పారు. వారికి మంచి ప్రవర్తనను ఆశిస్తూ ఏడాది పాటు రూ.2లక్షల బైండోవర్‌ను విధించారని తెలిపారు. మార్పురాకుంటే రూ.2లక్షలు జరిమానా విధించడమే కాకుండా వారిని రిమాండ్‌కు తరలిస్తామని హెచ్చరించారు. ఇప్పటివరకూ సారవకోట మండలంలో 40మంది బెల్టు నిర్వాహకులను, పాతపట్నం మండలంలో 23మందిని బైండోవర్ చేసినట్లు ఆయన తెలిపారు. ప్రజలకు నాణ్యమైన మద్యం అందించడమే ధ్యేయంగా ఎక్సైజ్‌శాఖ పనిచేస్తుందని తెలిపారు.

సైబర్ నేరాలపై అప్రమత్తం

నరసన్నపేట, నవంబరు 1(ఆంధ్రజ్యోతి): సైబర్ నేరాలపై ప్రతిఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని ఏఎస్ఐ తులసీనాయుడు సూచించారు. స్థానిక ఎల్‌వీఆర్ డిగ్రీ కళాశాలలో సంకల్ప, నారీశక్తి కార్యక్రమాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. గంజాయ్, డ్రగ్స్‌తో కలిగే అనర్థాలను వివరించారు. ప్రిన్సిపాల్ ఎం.ప్రసాదరావు, ఏవో జగన్నాథరావు, సిబ్బంది పాల్గొన్నారు.

‘అక్రమ లేఅవుట్లలో స్థలాలు కొనవద్దు’

సంతబొమ్మాళి, నవంబరు1(ఆంధ్రజ్యోతి): అక్రమ లేఅవుట్లలో స్థలాలు కొనుగోలు చేసి ప్రజలు మోసపోవద్దని సుడా ప్లానింగ్ అధికారి వెంకటేష్ అన్నారు. నౌపడ పంచాయతీలోని అక్రమ లేఅవుట్‌ను ఆయన శనివారం పరిశీలించారు. సర్వే నెంబరు 385-2,385-3లో ఎకరా 60 సెంట్ల స్థలంలో అక్రమంగా లేఅవుట్ వేసి ప్లాట్లు అమ్మకాలు చేపడుతున్న యజమానికి నోటీసులు జారీ చేస్తామని అన్నారు. ఆయన వెంట పంచాయతీ కార్యదర్శి ఉప్పాడ ఉమాపతి ఉన్నారు.

నేడు ఎర్రన్నాయుడి వర్ధంతి

కోటబొమ్మాళి, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): కేంద్ర మాజీ మంత్రి, దివంగత కింజరాపు ఎర్రన్నాయుడు వర్ధంతిని ఆదివారం తన స్వగ్రామం నిమ్మాడలో నిర్వహించనున్నట్లు కేంద్ర మంత్రి కింజరాపు రామ్మోహన్‌నాయుడు, రాష్ట్ర మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆదివారం ఉదయం 10 గంటలకు ఎర్రన్నాయుడు విగ్రహం, ఘాట్‌వద్ద కుటుంబ సభ్యులు, బంధువులు, నేతలతో కలిసి నివాళులర్పించనున్నట్లు చెప్పారు.

ఆయుష్ వైద్య సేవలను విస్తరించాలి

నరసన్నపేట, నవంబరు 1(ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో ఆయుష్ వైద్య సేవలను మరింత విస్తరించాలని ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి వైద్య సిబ్బందికి సూచించారు. శనివారం మాకివలస ఆయుష్ కేంద్రాన్ని ఆయన పరిశీలించారు. కేంద్రంలో అందుతున్న వైద్యసేవలు, మందుల పంపిణీ తదితర వివరాలను అడిగితెలుసుకున్నారు. వైద్యులు వెలమల మహాలక్ష్మి, నియోజకవర్గ టీడీపీ సమన్వయకర్త బగ్గు అర్చన తదితరులు పాల్గొన్నారు.

కష్టపడి పనిచేసే వారికి గుర్తింపు

మెళియాపుట్టి, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): కష్టపడి పనిచేసే ప్రతిఒక్కరికీ గుర్తింపు ఉంటుందని ఎమ్మెల్యే మామిడి గోవిందరావు అన్నారు. శనివారం జరిగిన టీడీపీ మండల కమిటీ ప్రమాణ స్వీకారోత్సవంలో ఆయన పాల్గొని మాట్లాడారు. పార్టీ కోసం పనిచేసే ప్రతి ఒక్కరికీ పదవులు వస్తాయని తెలిపారు. పార్టీ చేపడుతున్న పనులను ప్రజలకు ఎప్పటికప్పుడు వివరించాలని అన్నారు. టీడీపీ మండల అధ్యక్షుడిగా నంబాల వెంకటరావు, ప్రధాన కార్యదర్శిగా బొచ్చు ప్రసాదరావు, ఉపాధ్యక్షుడిగా గణపతిరావు ప్రమాణం చేశారు.

ప్రతిభాపాటవాలను పెంపొందించుకోవాలి

పాతపట్నం నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు ప్రతిభాపాటవాలను పెంపొందించుకోవాలని టెక్కలి డిప్యూటీ డీఈవో పి.విలియం అన్నారు. స్థానిక ఏపీ మోడల్ స్కూల్‌లో శనివారం నియోజకవర్గస్థాయి రాజ్యాంగ దినోత్సవ వేడుకల పోటీలను శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు వ్యాసరచన వక్తృత్వ పోటీలను నిర్వహించారు. వీటిలో గెలుపొందిన వారికి క్విజ్ పోటీలను నిర్వహించి విజేతలను ప్రకటించారు. ఈ పోటీల్లో ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాల్లో వరుసగా రేగేటి అభినయ్ (రొంపివలస), పి.వర్ష (ఎల్ఎన్‌పేట), జె.ప్రవీణ్‌కుమార్ (గులుమూరు) నిలిచారని ఎంఈవో తిరుమలరావు తెలిపారు. ఐదు మండలాల ఎంఈవోలు ఎ.గోవిందరావు, సీహెచ్ తిరుమలరావు దేవేందరరావు, రాంబాబు, మణికుమార్ పాల్గొన్నారు.

మాక్ అసెంబ్లీకి విద్యార్థుల ఎంపిక

నరసన్నపేట, నవంబరు 1(ఆంధ్రజ్యోతి): నియోజవర్గస్థాయి రాజ్యాంగ దినోత్సవ పోటీల్లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులను మాక్ అసెంబ్లీకి అధికారులు ఎంపిక చేశారు. వ్యాచరచన, క్విజ్ పోటీల్లో ఎం.గుణచరణ్ (బుడితి), వి.భరత్ సాయి (కంబకాయి), ఆర్.భాగ్యశ్రీ (శ్రీముఖలింగం), వక్తృత్వ పోటీల్లో బి.చంద్రకళ(కరవంజ), ఎస్. ధనుంజయ్ (కంబకాయి) ఎన్.వాణిశ్రీ (సారవకోట) ఎంపికయ్యారు. డైట్ లెక్చరర్ ఆర్.కృష్ణారావు, నరసన్నపేట, జలుమూరు, సారవకోట, పోలాకి ఎంఈవోలు పి.దాలినాయుడు, మాధవరావు, శ్రీనివాసరెడ్డి పాల్గొన్నారు.

ప్రతి ధాన్యం గింజా కొనుగోలు చేస్తాం

● రైతులందరినీ ఆదుకుంటాం ● మంత్రి అచ్చెన్నాయుడు

నందిగాం, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): ప్రతి ధాన్యం గింజనూ కొనుగోలు చేస్తామని మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు అన్నారు. నరేంద్రపురంలో నేలకొరిగిన వరి పైరును వ్యవసాయశాఖ జేడీ కె.త్రినాథస్వామి, టెక్కలి ఏడీఏ కె.జగన్మోహనరావుతో కలిసి ఆయన శనివారం పరిశీలించారు. మొంథా తుఫాన్‌తో పంటలు నష్టపోయిన రైతులను అన్ని విధాలా ఆదుకుంటామని మంత్రి పేర్కొన్నారు. అనంతరం వివిధ అభివృద్ధి పనులకు ఆయన శంకుస్థాపన చేశారు. రూ.1.97కోట్లతో చేపట్టనున్న నరేంద్రపురం జంక్షన్-వల్లభరాయుడుపాడు బీటీ రహదారి, రూ.1.20కోట్లతో నిర్మించనున్న వల్లభరాయుడుపాడు-దొడ్లరామచంద్రాపురం రహదారి పనులకు సంబంధించిన శిలాఫలకాన్ని ఆవిష్కరించారు. రూ.1.20కోట్లతో నిర్మించిన పాలూరు జంక్షన్-కొండపేట జంక్షన్ వయా మొజ్జువాడ బీటీ రహదారి, రూ.85లక్షలతో నిర్మించిన వల్లభరాయుడుపాడు-పాతటెక్కలి బీటీ రోడ్డును ప్రారంభించారు. కార్యక్రమంలో పలాస ఆర్డీవో జి.వెంకటేష్, అధికారులు పి.సోమేశ్వరరావు, కుమార్ పట్నాయక్, పి.శ్రీకాంత్‌వర్మ, నాగరాజు, పి.సంతోష్‌కుమార్, కె.అంజిత్‌కుమార్, నాయకులు తదితరులు పాల్గొన్నారు.



నరేంద్రపురం జంక్షన్ వద్ద వివిధ అభివృద్ధి పనుల కోసం శిలాఫలకాన్ని ఆవిష్కరించిన మంత్రి అచ్చెన్నాయుడు

పంట నష్టం నివేదికలు తయారు చేస్తాం

ఎల్.ఎన్.పేట, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): తుఫాన్ కారణంగా నష్టపోయిన పంటలను పరిశీలించి నివేదికలను తయారు చేస్తామని వ్యవసాయాధికారి కిరణ్‌వాణి తెలిపారు. దబ్బపాడు గ్రామ రెవెన్యూ పరిధిలో దెబ్బతిన్న వరి చేలను శనివారం ఆమె పరిశీలించారు. అగ్రికల్చర్ అసిస్టెంట్ బి.పద్మజ, రెవెన్యూ కార్యదర్శి జోగినాయుడు, రైతులు పాల్గొన్నారు.



దబ్బపాడులో నీట మునిగిన పంటను పరిశీలిస్తున్న అధికారులు

టెక్కలిలో రైతుల ధర్నా



టెక్కలి తహసీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా చేస్తున్న రైతులు

టెక్కలి, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): మొంథా తుఫాన్‌తో పంటలు దెబ్బతిన్న రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని సీపీఎం నాయకులు కోరారు. ఈ మేరకు శనివారం తహసీల్దార్ కార్యాలయం వద్ద తొలుసూరుపల్లి, బన్నువాడ, శ్రీరంగం, మోదుగువలస, జయకృష్ణాపురం, గోపినాథపురం గ్రామాల రైతులతో కలిసి ధర్నా చేశారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు షణ్ముఖరావు, అప్పలనా యుడు వంజంగి శ్రీనివాసరావు, కూర్మారావు, ఇందిరమ్మ, అమ్మోజీ పాల్గొన్నారు.

సస్య రక్షణతోనే నష్ట నివారణ

జలుమూరు, నవంబరు 1(ఆంధ్రజ్యోతి): భారీ వర్షాలకు దెబ్బతిన్న కూరగాయల పంటలకు సస్యరక్షణ చేపడితే నష్టం నివారించుకోవచ్చని ఉద్యానవనశాఖ అధికారి కె.సునీత తెలిపారు. అల్లాడ గ్రామంలో కూరగాయల పంటలను శనివారం ఆమె పరిశీలించారు. తుఫాన్‌కు దెబ్బతిన్న కూరగాయల పంటల సంరక్షణకు 19-19-19 లేదా మల్టీకే 5గ్రామ్స్‌లో కొద్దిగా యూరియా వేసి పిచికారి చేయాలన్నారు. కుళ్లు తెగులు రాకుండా ముందు జాగ్రత్త చర్యగా సాఫ్ పిచికారి చేయాలని సూచించారు. ఈ పరిశీలనలో ఉద్యాన విస్తరణాధికారి ఆమని, వ్యవసాయ సహాయకురాలు మీనాక్షి, పలువురు రైతులు పాల్గొన్నారు.

సందడిగా పింఛన్ల పంపిణీ

● లబ్ధిదారుల ఇళ్లకు వెళ్లి అందజేసిన ఎమ్మెల్యేలు, అధికారులు

జిల్లా వ్యాప్తంగా శనివారం సందడి వాతావరణంలో పింఛన్ల పంపిణీ చేపట్టారు. ఈ సందర్భంగా ప్రజా ప్రతినిధులు, అధికారులు లబ్ధిదారులకు పింఛన్ డబ్బులు అందజేశారు. తాము అధికారంలోకి వచ్చిన తరువాత సంక్షేమం, అభివృద్ధికి పెద్దపీట వేస్తున్నట్లు ఎమ్మెల్యేలు తెలిపారు. గత ప్రభుత్వం మాదిరిగా కక్షసాధింపులు చేపట్టకుండా అర్హులందరికీ పింఛన్లు మంజూరు చేస్తున్నట్లు చెప్పారు.

- ఆంధ్రజ్యోతి బృందం



కవిటి: బొరివంకలో పింఛను అందిస్తున్న ఎమ్మెల్యే అశోక్



పలాసరూరల్: పెదంచలలో పింఛన్ పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే శిరీష



బూర్జ మండలం లక్కుపురంలో పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే రవికుమార్



పాతపట్నం: దుర్గమ్మగుడికాలనీలో పింఛన్ అందిస్తున్న ఎమ్మెల్యే గోవిందరావు



జలుమూరు: లింగాలవలసలో ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి

కాశీబుగ్గ దుర్ఘటన బాధాకరం

పాతపట్నం రూరల్, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): కాశీబుగ్గ వేంకటేశ్వరస్వామి ఆలయంలో జరిగిన దుర్ఘటన బాధాకరమని ఎమ్మెల్యే మామిడి గోవిందరావు అన్నారు. మృతి చెందిన వ్యక్తుల కుటుంబాలకు ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. క్షతగాత్రులు త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. మంత్రి అచ్చెన్నాయుడు, పలాస ఎమ్మెల్యే గౌతు శిరీషతో కలిపి పలాస ఆసుపత్రిలో క్షతగాత్రులను పరామర్శించారు.

దురదృష్టకరం: ఎమ్మెల్యే బగ్గు

పోలాకి, నవంబరు 1(ఆంధ్రజ్యోతి): కాశీబుగ్గ వేంకటేశ్వర స్వామి ఆలయంలో జరిగిన తొక్కిసలాటలో 9మంది ప్రాణాలు కోల్పోవడం, పలువురికి గాయాలు కావడం దురదృష్టకరమని ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి అన్నారు. శనివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. ఈ ఘటనపై తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తంచేశారు. మృతుల కుటుంబాలకు సంతాపం తెలియజేశారు. రాళ్లపాడు నుంచి ఓబీసీ సంక్షేమ సంఘం కార్యదర్శి తులసిపాటి కృష్ణ.. కాశీబుగ్గ వెళ్లి సహాయక చర్యలు చేపట్టారు.

కలచివేసింది: కలమట

కొత్తూరు, నవంబరు1(ఆంధ్రజ్యోతి): కాశీబుగ్గ తొక్కిసలాట ఘటన తనను కలచివేసిందని టీడీపీ జిల్లా పార్లమెంటరీ అధ్యక్షుడు కలమట వెంకట రమణమూర్తి అన్నారు. శనివారం ఆయన విలేక రులతో మాట్లాడుతూ.. కార్తీక ఏకాదశిని పురస్క రించుకొని అంచనాకుమించి భక్తులు ఆలయానికి వెళ్లటంతో ఈ ఘటన చోటుచేసుకుందన్నారు. మృతుల కుటుంబాలకు తన సంతాపం తెలియజేస్తున్నట్లు తెలిపారు.

బాధ్యతారాహిత్యం: మాజీ మంత్రి

పలాస, నవంబరు 1(ఆంధ్రజ్యోతి): ఆలయంలో తొక్కిసలాట జరిగిన ఐదు నిమిషాల్లోనే అది ప్రైవేటు మందిరమని దేవాదాయశాఖ మంత్రి ప్రకటన ఇచ్చి తప్పించుకునే ప్రయత్నం చేశారని, ఇది పూర్తిగా బాధ్యతారాహిత్యమని మాజీ మంత్రి, వైసీపీ నేత సీదిరి అప్పలరాజు అన్నారు. శనివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. కార్తీక ఏకాదశికి ఆలయ రద్దీ ఉంటుందని తెలిసినా పోలీసులు సకాలంలో స్పందించలేదని, దీని కారణంగానే మృతుల సంఖ్య పెరిగిందని ఆరోపించారు. మృతులు, క్షతగాత్రులకు మెరుగైన వైద్యం, సహాయం అందించాలని డిమాండ్ చేశారు.

ప్రభుత్వానిదే బాధ్యత: సీపీఐ

తొక్కిసలాట ఘటనకు ప్రభుత్వమే బాధ్యత వహించాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి జి.ఈశ్వరయ్య అన్నారు. పార్టీ నేతలతో కలిసి ఆయన క్షతగాత్రులను పరామర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. మృతి చెందిన వారి కుటుంబాలకు ఒక్కొక్కరికి రూ.25లక్షల ఎక్స్‌గ్రేషియా ఇవ్వాలని డిమాండ్ చేశారు. ప్రమాద ఘటనకు కారణాలను వెలికితీయాలన్నారు. ఈ ఘటన తీవ్ర దిగ్భ్రాంతి కలిగించిందన్నారు. మంత్రి ఆనం నారాయణరెడ్డి మాట్లాడిన తీరు ఆక్షేపణీయమని, ప్రభుత్వం బాధ్యత వహించాలన్నారు. గుడి నిర్వాహకులు సమాచారం చెప్పలేదని చెబుతూ అధికారులు తప్పించుకోవడం సరైంది కాదన్నారు. క్షతగాత్రుల ఆసుపత్రి ఖర్చులు ప్రభుత్వమే భరించాలని డిమాండ్ చేశారు. ఆయనతో పాటు సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి జేవీ సత్యనారాయణ, జిల్లా కార్యదర్శి చాపర వెంకటరమణ, సభ్యులు ఉన్నారు.

ఇంజనీరింగ్ విద్యార్థులకు పట్టాలు

టెక్కలి, నవంబరు 1(ఆంధ్రజ్యోతి): ఆదిత్య ఇంజనీరింగ్ కళాశాలలో శనివారం పట్టభద్రుల దినోత్సవం నిర్వహించారు. 263మంది విద్యార్థులకు పట్టాలు, ఎనిమిది మంది ప్రతిభావంతులైన విద్యార్థులకు పతకాలు అందజేశారు. కార్యక్రమంలో జేఎన్‌టీయూ వైస్‌చాన్సలర్ ప్రొఫెసర్ వి.వెంకటసుబ్బారావు పాల్గొని మాట్లాడారు. విద్యార్థులు కేవలం డిగ్రీలకే పరిమితం కాకుండా నూతన సాంకేతిక పరిజ్ఞానం సాధించాలని అన్నారు. కార్యక్రమాలు కళాశాల చైర్మన్ సోమేశ్వరరావు, గవర్నింగ్ బాడీ చైర్మన్ పీవీజీడీ ప్రసాద్‌రెడ్డి, డైరెక్టర్ వీవీ నాగేశ్వరరావు, ప్రిన్సిపాల్ శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

శతశాతం ఉత్తీర్ణత సాధించాలి

పాతపట్నం నవంబరు1(ఆంధ్రజ్యోతి): పదో తరగతిలో శతశాతం ఉత్తీర్ణత సాధించాలని టెక్కలి ఉపవిద్యాశాఖాధికారి పి.విలియం పేర్కొన్నారు. స్థానిక అంబేడ్కర్ గురుకుల పాఠశాలను శనివారం ఆయన సందర్శించారు. పదో తరగతి విద్యార్థినులతో మాట్లాడారు. బోధనా తరగతులను ప్రత్యేకించి పరిశీలించారు. వంద రోజుల పాటు ప్రణాళికానుగుణంగా చదువుకుంటే శతశాతం ఉత్తీర్ణత సాధ్యమని వివరించారు.

వేలమంది.. ఒకటే క్యూలైన్

(ఐదో పేజీ తరువాయి)

ఉండదాయె. అయితే కార్తీకమాసం... ఏకాదశి సందర్భంగా శ్రీవేంకటేశ్వరున్ని దర్శించుకోవడం జిల్లా ప్రజలకు ఆనవాయితీ. శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయం చిన తిరుపతిగా పేరుగాంచింది. దీంతో మహిళలు శనివారం వేలాదిగా ప్రైవేటు వాహనాల్లోనూ, ఆర్టీసీ బస్సులలోనూ, ద్విచక్రవాహనాల్లోనూ తరలివచ్చారు. అయితే భక్తులకు ఇబ్బంది కలగకుండా ఎలాంటి ప్రత్యేక ఏర్పాట్లు చేపట్టలేదు. ఈ విషయాన్ని భక్తులు కూడా గమనించలేదు.

ఆలయ ప్రధాన గేటు వద్ద తొక్కిసలాట

ఆలయంలోకి ప్రవేశించే వారికోసం, తిరిగి వచ్చే వారికోసం ఆలయ ప్రధాన గేటు వద్ద స్టీల్ బ్యారక్‌లను ఏర్పాటుచేశారు. అదే ప్రాంతంలో మధ్యాహ్నం వేలాదిగా భక్తుల తాకిడితో ఒక్కసారిగా గందరగోళం నెలకొంది. భక్తులను నియంత్రించి.. రద్దీ లేకుండా క్యూలైన్లలో పంపించేందుకుగాను.. అక్కడ ఆలయ సిబ్బంది ఎవరూ లేరు. దర్శనం చేసుకుని తిరిగి వస్తున్న లైన్.. ఇటునుంచి ఆలయంలోకి భక్తులు వెళ్తున్న బ్యారక్ వద్ద తొక్కిసలాట జరిగింది. ఆలయం లోపల నుంచి వచ్చే బ్యారక్ వద్ద.. ఇటు నుంచి జనాలు చొచ్చుకుని పోవడంతో మహిళలు ఊపిరాడక బిగ్గరగా అరిచారు. రెయిలింగ్ విరిగిపోయింది. మహిళల చేతుల్లో ఉన్న పూజాసామగ్రి చిందరవందరగా పడిపోయింది. మెట్లపై కాళ్లకింద పలువురు మహిళలు పడిపోయి ఊపిరాడక ఏకంగా తొమ్మిది మంది అక్కడికక్కడే ప్రాణాలు విడిచారు. ఇందులో ఒక బాలుడు కూడా ఉన్నాడు. ఇద్దరి పరిస్థితి విషమంగా ఉండటంతో వారిని శ్రీకాకుళం తరలించారు. మరో 15 మంది గాయాలపాలయ్యారు. జిల్లాలోని పలు ప్రాంతాలకు చెందిన 25వేల మంది భక్తులు ఆలయానికి వచ్చిఉంటారని అంచనా. పోలీసులకు సమాచారం ఇవ్వకపోవడం.. వేల సంఖ్యలో మహిళలు రావడం.. పూర్తిగా ప్రైవేటు ఆలయం కావడంతో అధికార యంత్రాంగం కూడా ప్రమాదాన్ని అంచనా వేయలేకపోయింది. ఆలయ ప్రాంగణంలో సీసీ కెమెరాలు కూడా లేవు. వలంటీర్లను సైతం నియమించుకోక పోవడం ఘటనకు కారణమని తెలుస్తోంది. ఈ విషయంలో ఆలయ నిర్వాహకుల నిర్లక్ష్యం ఉన్నట్లు తెలుస్తోంది.

ఈ ఘటన ఊహించలేదు

వేంకటేశ్వరస్వామి ఆలయ ధర్మకర్త, వ్యవస్థాపకుడు హరిముకుందపండా మాట్లాడుతూ.. ‘ప్రతి సోమ, శనివారాల్లో భక్తులు అధికసంఖ్యలో వస్తుంటారు. వారికి ఇబ్బందులులేకుండా చర్యలు తీసుకుంటున్నాం. కార్తీక ఏకాదశి కావడంతో ఊహించని దానికన్నా అధిక సంఖ్యలో భక్తులు వచ్చారు. క్యూలైనులు ఏర్పాటు చేసినా భక్తులు ఒక్కసారిగా లైన్ల నుంచి జారిపడడంతో ఈ దుర్ఘటన జరిగింది. ఇందులో నాప్రమేయం లేదు. ఈవిధంగా జరుగుతుందని తాము ఊహించలేకపోయాం’ అని తెలిపారు.

పరామర్శించిన మంత్రులు

వ్యవసాయశాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు, పలాస ఎమ్మెల్యే గౌతు శిరీష ఘటనా స్థలానికి చేరుకున్నారు. క్షతగాత్రులతో.. వారి కుటుంబ సభ్యులతోనూ మాట్లాడారు. పలాసలో ఆసుపత్రి వద్ద రోదిస్తున్న మృతుల బంధువులను ఓదార్చారు. దేవాలయం వద్ద తొక్కిసలాటకు గల కారణాలు.. ఆ ప్రాంతాన్ని పరిశీలించారు. దేవాలయాన్ని నిర్మించిన ప్రైవేటు ట్రస్టు యజమాని హరిముకుంద పండాతో మాట్లాడారు. ఆలయంలోకి వేలాది మంది భక్తులు వస్తుంటే రక్షణ పెట్టుకోకుంటే ఎలాఅని ప్రశ్నించారు. ఇతర రాష్ట్రంలో ఉన్న కేంద్రమంత్రి కింజరాపు రామ్మోహన్‌నాయుడు తన పర్యటనను రద్దుచేసుకుని శ్రీకాకుళం వచ్చేశారు. విద్యాశాఖ మంత్రి నారా లోకేష్, హోంమంత్రి అనిత, జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి కొండపల్లి శ్రీనివాస్, టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు, జిల్లాకు చెందిన ఎమ్మెల్యేలు కలసి ఘటనా ప్రాంతాన్ని పరిశీలించారు. డీఐజీ గోపీనాథ్ జట్టి, కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్, ఎస్పీ మహేశ్వరరెడ్డి వంటి ఉన్నతాధికారులు కూడా మంత్రితోపాటు ఉన్నారు.

మంత్రి లోకేశ్ పరామర్శ

ప్రమాదం విషయం తెలిసిన వెంటనే మంత్రి నారా లోకేశ్ తీవ్ర దిగ్భ్రాంతికి గురయ్యారు. హుటాహుటిన విశాఖ వచ్చి అక్కడి నుంచి రోడ్డు మార్గాన పలాసకు చేరుకున్నారు. సాయంత్రం 6-45 గంటల నుంచి రాత్రి 8-15 గంటల వరకు ఇక్కడే ఉన్నారు. ఆలయం లోపలకు వెళ్లి పరిశీలించారు. ప్రమాదం జరిగిన తీరును అధికారులను అడిగి తెలుసుకున్నారు. అలాగే మృతుల కుటుంబాలను, క్షతగాత్రులను పరామర్శించారు. తాను ఉన్నానంటూ భరోసా కల్పించారు. మృతుల కుటుంబాలకు రాష్ట్ర ప్రభుత్వం రూ. 15లక్షలు, కేంద్రప్రభుత్వం రూ. 2లక్షలు కలిపి మొత్తం రూ. 17 లక్షలు ఆర్థిక సాయం అందిస్తామని లోకేష్ ప్రకటించారు. తీవ్రంగా గాయపడిన వారికి రాష్ట్రం నుంచి రూ. 3లక్షలు, కేంద్రం నుంచి రూ.50వేలు కలిపి మొత్తం రూ.3.5 లక్షలు ఇస్తామన్నారు. మృతుల కుటుంబాలకు మట్టి ఖర్చుల కింద తక్షణ సహాయంగా రూ.10వేలు ఇస్తామన్నారు. మృతుల్లో టీడీపీ సభ్యత్వం ఉన్న ముగ్గురు కార్యకర్తల కుటుంబాలకు బీమా కింద ఒక్కొక్కరికి అదనంగా రూ.5లక్షల చొప్పున అందుతుందన్నారు. హోంమంత్రి వి.అనిత కూడా పలాసకు వచ్చారు.

తొక్కిసలాట ఘటనపై కేసు నమోదు

కాశీబుగ్గలో శ్రీవేంకటేశ్వర స్వామి ఆలయంలో జరిగిన తొక్కిసలాట ఘటనపై.. అలాగే తొమ్మిది మంది మృతి.. పలువురికి తీవ్రగాయాలపాలవ్వడంపై కాశీబుగ్గ పోలీసు స్టేషన్‌లో కేసు నమోదైంది. దీనిపై త్రిసభ్య కమిటీ విచారణ జరగనుంది. ఇప్పటికే ఈ ఘటనపై విచారణకు ఆదేశిస్తూ కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ చర్యలు తీసుకున్నారు. మృతదేహాల పోస్టుమార్టం పూర్తిచేయించి మంత్రుల సమక్షంలోనే బాధిత కుటుంబాలకు అప్పగించారు.

కలెక్టర్ ఏమన్నారంటే..

కాశీబుగ్గలో ఆలయంతో దేవదాయశాఖకు సంబంధం లేదని కలెక్టర్ స్పష్టం చేశారు. ఈ ఆలయం ప్రైవేటు వ్యక్తులకు చెందినదని, సొంత నిధులతో ఈ ఆలయం నిర్మించారని చెప్పారు. భవిష్యత్తులో ఇలాంటివి పునరావృతం కాకుండా చర్యలు తీసుకుంటామన్నారు. ఆలయాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేస్తామని తెలిపారు.

పలాస-కాశీబుగ్గలో హై అలెర్ట్..

ఉత్తరాంధ్రకు చెందిన పోలీసు బృందం కొంత సమయం వ్యవధిలో పలాస కాశీబుగ్గకు చేరుకున్నారు. జంట పట్టణాల్లో హైఅలెర్ట్ ప్రకటించారు. విశాఖ రేంజ్ డీఐజీ గోపీనాథ్ జట్టి, శ్రీకాకుళం ఎస్పీ మహేశ్వరరెడ్డి, విశాఖ, విజయనగరం జిల్లాల ఏఎస్పీలు, డీఎస్పీలు.. ఇంటెలిజెన్స్ పోలీసులు, ఇతర విభాగాల కీలక పోలీసులు.. ప్రత్యేక పోలీసులు కాశీబుగ్గలో మోహరించారు. అసాంఘిక శక్తులు ప్రబలకుండా చర్యలు తీసుకున్నారు. మృతుల పోస్టుమార్టం పూర్తిచేయించడంతోపాటు.. ప్రత్యేక వాహనాల్లో స్వగ్రామాలకు తరలించారు. అలాగే అంబులెన్స్‌లో క్షతగాత్రులను తీసుకువెళ్లేటప్పుడు పోలీసులు కూడా వెంటవెళ్లారు.

పలువురి పరామర్శ..

క్షతగాత్రులను.. అలాగే మృతుల కుటుంబాలను ప్రముఖులు పరామర్శించారు. ఇందులో మాజీమంత్రి గౌతు శ్యామసుందర శివాజీ, టీడీపీ జిల్లా అధ్యక్షుడు కలమట వెంకటరమణ, పీయూసీ చైర్మన్ కూన రవికుమార్, విజయనగరం ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు, ఎమ్మెల్యేలు గౌతు శిరీష, గొండు శంకర్, మామిడి గోవిందరావు, బగ్గు రమణమూర్తి, జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి కొండపల్లి శ్రీనివాస్, టీడీపీ పలాస నియోజకవర్గ సమన్వయకర్త యార్లగడ్డ వెంకన్న చౌదరి తదితరులు పరామర్శించారు.